# యమ్.వి.వి.సత్యనారాయణ

## మనసే మందిరం

కారు పోర్టికోలో ఆగింది.

జమున చకచకా పరుగెత్తుకు వచ్చింది. కృష్ణారావు కారు తలుపు తెరిచాడు. కూతురును చూస్తూనే కారు దిగాడు.

"డాడీ ! టిక్కట్లు దొరికాయా ?" అడిగింది జమున.

"దొరికాయి తల్లీ !" అన్నాడు కృష్ణారావు

"ఎన్ని ?" గారాబంగా అతడి భుజం పట్టుకుంది.

కృష్ణారావు ఆమె ముంగురులు నిమిరి, "నేనెందుకులే తల్లీ ! నువ్వూ, గిరీ వెళ్ళిరండి. సంతోషంగా గడపి రండి" అన్నాడు.

"నువ్వు యిక్కడ ఒంటరిగా ఏం చేస్తావమ్మా !" వ్యంగ్యంగా అంది జమున.

"మీ సంతోషాన్ని యిక్కడ పంచుకుంటాను."

"అదెలా సాధ్యం డాడీ ?"

"మనసు అద్భుతమైనది తల్లీ! వాస్తవంగా అనుభవించిన దానికంటె వూహించుకున్నదే ఎక్కువ అనుభూతినిస్తుంది."

జమున తండ్రి చెక్కిళ్ళు నొక్కింది. లోపలకు పరుగెత్తింది. టెలిఫోన్ డయల్ చేసింది. అవతల ఫోన్ ఎత్తారు.

"గిరీ !" అంది జమున.

"ఆఁ! నేనే !"

"మీరు రిజర్వేషన్‌కి వెల్తారా ?"

"ఎందుకు మామయ్యగారు వెళ్ళారు కదా!' నవ్వాడు గిరి.

"వెళ్ళారు వచ్చారు. మన యిద్దరికే చేయించారు."

"అదేమిటి ఆయనకు ఉదయం అంతా చెప్పిండి మనం ఒప్పించాం కదా !"

"అవును తీరా వెళ్ళివచ్చి ఆయన చేసుకు వచ్చిన నిర్వాకం యిది !"

"ఆల్‌రైట్ నేను మరో సీటు చేయించుకు వస్తాను."

"సీటు కాదు.. బెర్త్"

గిరి నవ్వాడు. జమున కూడా శృతి కలిపి మెల్లగా రిసీవర్‌ను క్రెడిల్ చేసింది.

అప్పటికి కృష్ణారావు కూతురును సమీపించాడు.



"నీ పట్టు విడవ్వ" అన్నాడు మురిపెంగా.

"అవును డాడీ ! ఇందాక నువ్వు మనసు గురించి గీత బోధించావు కదా !"

"అది గీతా బోధనా ?"

"అవును. నువ్వు యిక్కడ ఏకాంతం అనుభవిస్తావు. నీ గురించిన బాధ ఎక్కువగా వుంటుంది నాకు."

కృష్ణారావు కళ్ళు చెమర్చాయి. కూతురి కంట పడకుండా తల త్రిప్పుకున్నాడు. ఆమె

చెక్కిళ్ళు చిడిమి తన గదిలోకి నడిచాడు. మంచం మీద వెల్లకిలా పండుకున్నాడు.

ఆలోచనలు కందిరీగల్లాగా తరుముతోన్నాయి. తాను కూతురితో అల్లుడితో కలసి వూటీ వెళ్తున్నాడు. పార్వతితో కలసి జంటగా వెళ్ళేవాడు. ఇప్పుడు తాను ఒంటరిగా వెళ్ళి ఆ పరిసరాలను తట్టుకోగలడా పార్వతితో కలసి జంటగా తిరిగిన ప్రాంతాలు తాను ఒక్కడే తిరగగలడా?

జమునకి రెండో ఏడు వచ్చాక చివరిసారిగా తానూ పార్వతీ వూటీ వెళ్ళి వచ్చారు. ఇపుడు జమునకు ఇరవై ఏళ్ళు పద్దెనిమిదేళ్ళలో వూటీ ఎంత మారిపోయిందో అన్నట్టు అక్కడ తనకు బాగా పరిచయంవున్న యిద్దరు వ్యక్తులు ప్రస్తుతం ఎక్కడవున్నారో?

పార్వతి... ఆమె లేని లోటు తన జీవితమంతా లోటే ఎన్ని నెలలు ఆమెతో వూటీలో గడిపాడు? ఎన్నిఏళ్ళు ఆమెతో తన జీవితం పంచుకొన్నాడు? పార్వతి తనను అన్యాయం చేసి పోతుందని తాను కలగన్నాడా? తన అందంలోంచి సమగ్రమైన తునకను యిచ్చి మరీ పోయింది పార్వతి. ఆమెది అన్యాయం ఎలా అవుతుంది? పార్వతి మీద శృంగారం, ప్రేమ జమునపట్ల వాత్సల్యంగా రూపుదిద్దుకుంది.

పార్వతి తనకు ప్రేమించడం నేర్పింది. ప్రేమలో పరాకాష్ట నేర్పింది. ప్రేమ ప్రేమ కోసమే కాదని చెప్పింది తరువాత తరాలకు అందవలసిన ఆస్తి ప్రేమ తరాలుమారేకొద్దీ ప్రేమస్వరూపం మారుతుంది.

తానూ పార్వతీ వూటీలో ఒక స్వర్గం చూశారు.

తమ ఒరవడిలోకి జమునా గిరి వచ్చారు. ఒక్కోతరంలో ఒక్కొక్కరు శృంగార నాయికా నాయకులు సృష్టిరహస్యానికి కాపలాదారులు.

ప్రయాణంరోజు రానే వచ్చింది.

"గిరీ!" పిలిచాడు కృష్ణారావు.

గిరి గదిలో సూట్‌కేసు సర్దుతున్నాడు, అతడిప్రక్కన జమున తన చీరెల మడతలు సర్దుతోంది.

"రగ్గులు బెంగుళూరులో కొనుక్కోవచ్చును" అంటున్నాడు గిరి. అంతలోనే మామగారు పిలిచాడు.

"వస్తున్నాను మామయ్య" అన్నాడు గిరి. రెండు నిమిషాలలో మామగారి దగ్గరకు వెళ్ళాడు.

"రిజర్వేషన్ టిక్కట్లు సరిగా వున్నాయి కదా!" అన్నాడు కృష్ణారావు.

గిరి తలూపాడు.

"ఒక్కసారి స్టీమ్ లాండ్రీకి ఫోన్ చెయ్యి గిరీ! నా బట్టలు యింకా తీసుకురాలేదు."

గదిలోంచి జమున అరచింది. "మరచిపోయాను డాడీ! లాండ్రీనుండి బట్టలువచ్చాయి నాగదిలో ఉన్నాయి."

గిరి నవ్వి, "మామయ్యా! నీవు రాకుండా వుండటానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేశావు. చేస్తున్నావు" అన్నాడు.



కథా నిలయం
శ్రీకాకుళం

కృష్ణారావు కూడా వ్యర్థమైన నవ్వు ఒకటి విసిరి, "చెప్పానుగదా గిరి! అక్కడ మీ అత్తయ్య గుర్తొస్తుంది. ఆ జ్ఞాపకాలకు తట్టుకో లేనేమోనని అనుమానం" అన్నాడు.

గిరి నవ్వడం ఆపి గంభీరంగా చూశాడు. "నువు యిక్కడ ఒంటరిగా ఆగిపోయినా జ్ఞాపకాలు నిన్ను వదలవ్."

కృష్ణారావు మాట్లాడలేదు. మౌనంగాలేచి జమున గదిలోకి నడిచాడు.

అరగంటలో ముగ్గురూ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్సులో వున్నారు. గిరికీ, జమునకూ ఒక కూపేలోనూ, కృష్ణారావుకు మరో కూపే లోనూ రిజర్వేషన్ దొరికింది.

బండి స్టేషన్‌ను వదిలింది. కిటికీలోంచి గాలి తగులుతోంది. జమున ఆహ్లాదంగా కిటికీకి తలవాల్చింది. కంపార్ట్‌మెంట్ సున్నితంగా కదులుతోంది. లయబద్ధమైన వూగు-క్రమబద్ధమైన వేగంతో ఎక్స్‌ప్రెస్ వురుకుతోంది.

జమున గోముగా చూచింది. ఆమె చెక్కిలి మీద గరుకుగా చర్మం తగిలింది. జుత్తులోకి వంకీలజుత్తు చొచ్చుకుపోవాలని ప్రయత్నించింది. ఆమె చెయ్యి చాపింది. గిరి మొహాన్ని ఆప్యాయంగా నిమిరింది. వంకీల జుత్తులోకి వేళ్ళు పోనిచ్చింది. మొహాన్ని ముందుకు లాక్కుంది.

ఆమెను భుజాలమీదుగా గుండెలకు హత్తుకున్నాడు గిరి. గాలి గిలిగింతలు పెడుతోంది. జమున పులకరించింది. అతడి చేతులు ఆమె నడుమును చుట్టేశాయి.

"ఊటీలో నన్ను బతకనివ్వరేమో!" అంది జమున.

"ఊహూఁ!" అతడి పెదిమలు గుసగుసలాడాయి. "నువ్వే నన్ను బతకనివ్వవ్."

ఎక్స్‌ప్రెస్సు చీకూచింతాలేని మనిషిలాగా సాగిపోతోంది. రాత్రి ఏడు గంటలకు మద్రాస్ సెంట్రల్‌లో ఆగింది ఎక్స్‌ప్రెస్. తెల్లవారేసరికి బెంగుళూర్ నుండి ఊటీపోయే దారిలో వున్నారు ముగ్గురూ.

ఊటీలో కాటేజ్ దొరికింది. కాటేజ్‌లో రెండు వాటాలున్నాయి. ఎక్స్‌ప్రెస్సులో రిజర్వేషన్‌లాగా కాటేజ్ విషయంలో కూడా కృష్ణారావు రిజర్వేషన్ ఆలస్యమయింది.

మూడోనెంబర్ కాటేజ్‌ముందు నిలబడ్డాడు గిరి.

సర్వీసింగ్ బాయ్ కాటేజ్‌లో సామాను సర్దుతున్నాడు. జమునా, కృష్ణారావూ అయిదో నెంబర్ కాటేజ్‌లోకి నడిచారు. ఒక వాటాలో కృష్ణారావు తన బెడ్డింగ్ అమర్చుకొన్నాడు.

"డాడీ! అంతా విడివిడిగా ఏర్పాట్లయ్యాయి" అంది జమున.

కృష్ణారావు నవ్వి వూరుకున్నాడు. భవిష్యత్తు ఉన్న తరం వాళ్ళది. తనకి భవిష్యత్తు ఇంకేముంది? మృత్యువు పిలుపుతప్ప.

"చాల అలసటగా ఉంది" అంది జమున మూడో నెంబర్ కాటేజ్‌కి వస్తూనే.

గిరి ఆమె చెక్కిలిమీటి, "పాపం! నువ్వొక్కత్తెవే అలిసిపోయావు" అన్నాడు.

జమున హాండ్‌బాగ్‌ను చిలకకొయ్యకు తగిలించి, "మీతో జోక్‌చేసే ఓపికలేదు బాబూ" అంది.

"ఫరవాలేదులే, నాకు ఓపిక ఉంది"

జమున అతడిని డొక్కలో గుచ్చి, "మీ మామయ్యకు అయిదో నెంబర్ కాటేజ్‌లో బస దొరికిందని మీకు సంతోషంగా ఉన్నదన్న మాట" అంది.

"హతోస్మి. ఈ కాటేజ్‌లోనే ఈ వాటాలోనే కృష్ణారావుగారికి బస ఏర్పాటుచేసే తెలివితక్కువతనం కాటేజ్ అధికారులకులేదు."

జమున పకపక నవ్వి బాత్‌రూంలోకి ప్రవేశించింది. తలుపు మూయబోయింది. గిరి చటుక్కున తలుపు పట్టుకున్నాడు.

"తలుపు వదలండి!" అంది జమున.

"కాటేజ్‌లో ఉన్నది ఇద్దరం. ఇద్దరమూ ఒకరి గురించి మరొకరం తెలియనివాళ్ళం కాదు. తలుపులు వేసుకోవడం దేనికి?"

"బాగుంది. సిగ్గులేకపోతేసరి"

"నీకూ నాకూ మధ్యనున్నది—ఎవరికి తెలియదని" సినిమాపాట అందుకున్నాడు గిరి.

జమున అతడిని బలవంతంగా నెట్టి తలుపు మూసింది. గిరి సోఫాలో పడ్డాడు.

చల్లటి నీళ్లు ఒంటిమీద పడగానే ప్రాణం లేచివచ్చినట్టయింది. జమున పొడిబట్టలు కట్టుకుని బాత్‌రూంలోంచి వచ్చింది. గిరి ఆమెను నవ్వుతూ చూశాడు.

జమున పరుగెత్తుకునివెళ్ళి గదిలో ప్రవేశించి తలుపు లోపల నుండి మూసింది.

"ఇదేమిటీ వికారం?" అన్నాడు గిరి.

పావుగంట తర్వాత జమున గదిలోంచి బయటకు వచ్చింది.

ఆమె శరీరంలోంచి సుగంధం వస్తోంది. గిరి ప్రేమగా ఆమెను సమీపించబోయాడు

ఆమె చేతులు అడ్డంపెట్టుకుని, "ముందు స్నానం కానివ్వండి మహాప్రభో!" అంది.

"అందుకే జమూ నువ్వు నన్ను బతకనివ్వవు అన్నాను."

"సంబరం" మూతి త్రిప్పింది జమున. "మీరు స్నానం ముగించండి. నాన్నగారుకాంటీన్‌కి కలిసి వెళ్దాం అన్నారు." అంటూ బయటికి నడిచింది. గిరి పళ్ళు బిగించి బుగ్గలు పూరించాడు.

జమున అయిదో నెంబర్ కాటేజ్ ముందు నిలబడిపోయింది. తండ్రి అక్కడే నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

కూతురును చూస్తోనే కృష్ణారావు కళ్ళు పెద్దవి చేశాడు. "రా తల్లీ! నీకోసం కాటేజ్‌కి వద్దాం అనుకుంటున్నాను" అన్నాడు.

ప్రక్కనున్న వ్యక్తి వినయంగా చూచి, "అమ్మాయి గారా!" అన్నాడు.

జమున అతడివైపు తల త్రిప్పింది. అతడి దుస్తులు మాసిపోయి వున్నాయి. ఏనాటిదో నలిగిపోయిన పాంటు మీద చిరిగిపోయిన చారల చొక్కా వేసుకున్నాడు. మనిషికి తల మాసిపోయి వుంది. గడ్డం, తలపండి ఉన్నాయి. ఒత్తుగా పెరిగిన గడ్డం మెడవరకూ పెరిగివుంది. కుడి చొక్కా చెయ్యి నిరుత్సాహంగా గాల్లో వ్రేలాడుతోంది.

"ఎవరు డాడీ?" అడిగింది జమున.

"ప్రతాపరావు తల్లీ..."

"ప్రతాపరావు..." మెల్లిగా ఉచ్చరించింది జమున.

"నేను చెబుతూండే వాడిని గదా తల్లీ ... గుర్తొచ్చిందా?"

జమున తలూపింది. తనకు గుర్తొచ్చింది. అతడు ఇక్కడ వన్యమృగ సంరక్షణ శాఖలో పనిచేసేవాడట. తండ్రి వూటీ వచ్చినప్పుడు ఇక్కడ పరిచయమయాడట.

"జమునా! మీ అమ్మను కాపాడింది ప్రతాపరావేనమ్మా! లేకపోతే చారల మెకం నామీదకు దూకేదే తల్లీ!"

ప్రతాపరావు మొహంలో సిగ్గు దోబూచులాడింది. "బాబుగారూ! పద్దెనిమిదేళ్ళనాటి విషయం మీకు ఇంకా గుర్తుంది. అస్తమానం ఆ విషయం గుర్తుచేసి నన్ను మరీ ఇబ్బంది పెట్టకండి బాబు గారూ!" అన్నాడు.

"చిన్న విషయమా! నా పార్వతిని రక్షించావు. లేకపోతే ఈ నాడు నా బంగారుతల్లితో ఈ రకంగా వూటీకి వచ్చేవాడినా?" అతడి భుజం తట్టాడు కృష్ణారావు.

"బాబు గారూ మీరు ఒకసారి మా ఇంటికి రావాలి."

"తప్పకుండా."

"కన్య మిమ్మల్ని రోజూ అడుగుతూంటుంది."

కృష్ణారావు చిరునవ్వునవ్వాడు.

"నేనూ పార్వతీ ఎప్పుడు వచ్చినా మాకు కన్యే బట్టలుతికేది" అన్నాడు కృష్ణారావు.

"నన్ను పెళ్ళి చేసుకుంది బాబుగారూ !"

"ఆఁ!" నమ్మలేకపోయాడు కృష్ణారావు

"డాడీ కాంటీన్‌కి వెళ్దామా? ప్రతాపరావు గారిని పిలువు డాడీ" అంది జమున.

"నేనెందుకండి అమ్మాయిగారూ ! కన్య నా కోసం చూస్తూంటుంది. ఏటికి వెళ్ళింది."

కృష్ణారావు అతడిని పంపించాడు. "నువ్వు వెళ్ళి గిరిని పిలుచుకురా!" అన్నాడు.

జమున వెనక్కి తిరిగింది. వాతావరణం ఆహ్లాదంగా వుంది. తీక్షణత లేని ఎండ. కొద్దిగా చలి తేమతో కూడిన గాలి వరుసలు వరుసలుగా! కొండల మీద ఎవరో అంటించినట్టు పచ్చటి తివాచీ... తివాచీ అంచులలో పూలమొక్కలు, కొండలలో సయ్యాటలాడే మబ్బులూ...

తివాచీ లాంటి గడ్డిమీద ఎవరెవరో కదులుతున్నారు. కొంత మంది ఫొటోలు తీయించుకుంటున్నారు. మరికొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. గడ్డి మీద సుతారంగా నడుస్తూ కాటేజ్‌లోకి పిల్లిలాగా ప్రవేశించింది జమున.

గిరి ఏం చేస్తున్నాడో...

బాత్‌రూంలో లేడు... గదిలో లేడు, పిట్టగోడకు అనుకుని నిలబడ్డాడు గిరి. రెండు చేతులూ ఎత్తి అతడు అటు తిరిగి నిలబడ్డాడు. మెల్లగా అతడిని సమీపించింది జమున. గిరి చేతిలో బైనాక్యులర్స్ వున్నాయి. వాటితో అతడు తదేకంగా చూస్తోన్నాడు.

"గిరీ !" అంది జమున.

గిరి త్రుళ్ళిపడ్డాడు. బైనాక్యులర్స్ లోంచి అతి కష్టం మీద చూపు మరల్చాడు.

"భోజనానికి రండి"

"పద"

"ఏమిటి చూస్తున్నారు ?"

గిరి చటుక్కున అడుగువేసి "పద... నువ్వు యింకా రాలేదేమిటా అని...దూరంగా" అన్నాడు.

జమున బైనాక్యులర్స్ అంది పుచ్చుకుంది. ఆమె మొహం ఎర్రబడింది. చేతివ్రేళ్ళు వణికాయి. పెదిమలు బిగుసుకున్నాయి. చటుక్కున బైనాక్యులర్స్ తీసి గిరి చేతులకు అందించింది.

ఆమె కళ్ళలో ఎర్రజీర కదిలింది. "బాగా చూడండి. నేను మీకు పానకంలో పుడకలాగా అడ్డం ఎందుకు?" అంది.

"జమునా! ప్లీజ్...నన్ను అర్థం చేసుకో."

"చేసుకున్నాను. మీది కాముకదృష్టి. ప్రేమచూపు కాదు."

"కావచ్చును. కాని...నేను కావాలని ఆమె వైపు చూడలేదు."

"మరి...ఆమె చెప్పిందా? నేను గుడ్డలు విప్పుకుని ఈ ఏటిఒడ్డున స్నానంచేస్తాను నువు బైనాక్యులర్స్‌లోంచి నన్ను చూడు అని."

"తొందరపడక జమునా! నేను మామూలుగా బైనాక్యులర్స్‌లోంచి చూస్తున్నాను సెలయేరూ, అరిగిపోయిన రాళ్లూ..."

"పోనీలెద్దురూ...పనికిమాలిన సంజాయిషీ మీరుకూడా ఆమెలాగానే గుడ్డలు విప్పుకుని ఊటీ కొండలన్నీ తిరగండి."

"ఆమె ఒంటిన గుడ్డవుంది."

"ఏం లాభం? మీరు ఆ గుడ్డను ఒలిచి చూస్తున్నారు."

"అలా అయితే నిన్నూ అలాగేచూస్తాను."

"ఛీ...మీ మగజాతికి సిగ్గులేదు. నగ్నత్వం మీద మోజు."

"పుట్టినప్పుడు లేదు బట్ట. గిట్టినపుడు లేదు బట్ట. నడుమ బట్టకట్ట నగుబాటు కాదా ... అయినా మీ ఆడ వాళ్ళు బాత్‌రూమ్‌లో నగ్నంగా సామూహిక స్నానాలు చేయగలరు. మగవాళ్ళు ఒకనాటికి అలా చచ్చినా చేయలేరు."

జమున వినిపించుకోలేదు. విసవిసా నడను కుంటూ వెళ్ళిపోయింది. గిరి బైనాక్యులర్స్ లోంచి చూశాడు. సెలయేటి ఒడ్డున ఆమె సుకుమారంగా పొడిబట్ట చుట్టుకుంటోంది. క్షణక్షణానికి అటూ ఇటూ చూస్తోంది. సున్నితంగా తడిగుడ్డను సెలయేటిలోకి కాలితో నెట్టింది. పొడిగుడ్డను భుజాలక్రిందుగా చుట్టుకుని గుండెలమీద అంచు దోపింది. నీటిలోకి వొంగి విడిచిన గుడ్డను పుతుకుతోంది. చాలీ చాలని పొడిగుడ్డమాటున ఆమె దబ్బపండులాగా మెరుస్తోంది.

ఆమె ఒంటి బరువుకు గుడ్డ పొంగింది.

అతను బైనాక్యులర్స్‌ను కాటేజ్‌లోఉంచి కాటేజ్‌కి తాళంపెట్టాడు. పసిరికమీద తండ్రీ కూతుళ్ళు నడుస్తున్నారు. గిరి వాళ్ళను కలుసుకున్నాడు.

జమున ఎటో చూస్తూ నడుస్తోంది.

"గిరీ! జమునను ఏమైనా అన్నావా?" అడిగాడు కృష్ణారావు.

గిరి అమాయకంగా తల అడ్డంగా త్రిప్పాడు. జమున యిద్దరి సంభాషణతో తనకు పనిలేనట్టుగా ముందుకు కదిలింది. ముగ్గురూ కాంటీన్‌లో ప్రవేశించారు.

భోజనాలయాక జమునను మోచేత్తో పొడిచాడు గిరి.

"ఏయ్! నీకు ఇంకా కోపం పోలేదా?" అన్నాడు.

"లేదు"

"గిరీ! మీ అత్తయ్యను ఇక్కడే సెలయేటి దగ్గర ఒక పులి ఎదుర్కోబోయింది. ఆ స్థలం చూపిస్తాను. నడవగలవా?" అన్నాడు కృష్ణారావు.

జమున మూతిని సున్నాలాగా చుట్టి "అబ్బే నడవలేరు. మెడమీద ఎక్కించుకుంటావా డాడీ?" అంది.

"ఓయస్. నేను సిద్ధమే!" అన్నాడు గిరి.

కృష్ణారావు నవ్వి పసరికలోంచి దారి తీశాడు. గిరీ, జమున ఆయనను అనుసరించారు. గులకరాళ్ళ దారి ఎదురయింది. తరువాత సన్నటి పాయ, దాని తర్వాత వెడల్పైన సెలయేటి ప్రవాహమూ తగిలాయి. కృష్ణారావు సెలయేటి ఒడ్డునే నడవసాగాడు.

"మీ స్వప్నసుందరి నగ్నంగా విహరించిన ప్రాంతానికే వెళ్తున్నాం" నవ్వింది జమున.

"స్వప్నసుందరా?" కలగచేసుకున్నాడు కృష్ణారావు.

(తరువాయి 73వ పేజీలో)


నూతన యవ్వనం పొందండి



సంతానవంతులుకండి! చర్మవ్యాధులనుండి విముక్తులు కండి!

దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత దాంపత్యసుఖం లేకపోవుట, ఉబ్బసం, మేహమచ్చలు, మొదలగు సమస్త దీర్ఘవ్యాధులకు అద్భుత ఆయుర్వేద చికిత్స! పోస్టు వార్వా చికిత్సకలదు.

క్యాంపులు: * ప్రతి ఆదివారం భీమవరం - షణ్ముఖ-లాడ్జిలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6-30 గంటల వరకు. * ప్రతినెల 1 మరియు 16 తేదీలలో రాజమండ్రి - హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు.

ఫోన్స్ : ఆఫీసు : 522

నివాసం : 540

డా॥ డి. మార్కండేయులు

పార్కురోడ్, గుడివాడ-521 301

ఆయుర్వేదభిషక్. సెక్స్. స్కిన్ స్పెషలిస్ట్

(53వ పేజీ తరువాయి)

గిరి నవ్వి, "జమున ఏవో జానపద కథలు చదివి బుర్ర పాడుచేసుకుంది" అన్నాడు.

దిరిసెన చెట్టువద్ద ఆగాడు కృష్ణారావు. "ఈ చెట్టు చాటునే ఆగివుంది పులి. మీఅమ్మా నేనూ ఈ సెలయేటి వైపు రాబోయి అక్కడే ఆగాం. పులిని మేము చూడలేదు. చెట్టువైపు వస్తోన్నాం"

జమున గుండెలమీద చెయ్యివేసుకుంది.

"ఎక్కడినుండో ప్రతాపరావు పరుగెత్తుకు వచ్చాడు. అతడి మెడలో బైనాక్యులర్స్ వ్రేలాడుతోంది. మమ్మల్ని దాటి ఆపాడు."

"పులి మీద పడిందా?"

"మీ అమ్మ ఎర్రటి చీర కట్టుకొనుంది. మీ అమ్మకూ పులికీ మధ్యకు వచ్చాడు. ప్రతాపరావును పులి గుర్రుగా చూచి వెనక్కి తిరిగి పారిపోయింది"

గిరీ, జమునా నిట్టూర్చారు.

కృష్ణారావు పల్లంలోకి దిగాడు. ముగ్గురూ ఒక గుడిసె ముందుకు వచ్చారు. గుడిసె యివతల చిన్న అమ్మాయి ఆడుకుంటోంది. ముగ్గురినీ చూచి అమ్మాయి లోపలికి పరుగెత్తింది.

లోపలినుండి ఒకామె బయటకు వచ్చింది.

ఆమెను చూస్తూనే కృష్ణారావు నిర్ఘాంతపోయి, "కన్యా! నువ్వేనా?" అన్నాడు.

ఆమె తల కొద్దిగా పండింది. దబ్బపండు రంగులో వున్న మొహంమీద ఎర్రటి కుంకుమ బొట్టు పెట్టింది. పల్చటి రవికె తొడిగి రంగు వెలసిన చీరెను గుండెలమీదుగా చుట్టుకుంది. కాళ్ళకు బరువైన కడియాలు బింకమైన శరీరం.

"హుష్... స్వప్నసుందరి!" గిల్లింది జమున.

గిరి నిర్లిప్తంగా ఆమె మొహంలోకి చూశాడు.

"ఎవరు బాబుగారూ?" అంది కన్య.

"పార్వతిని మరచిపోయావా?" అన్నాడు కృష్ణారావు.

"బాబుగారూ... మీరా?" అంది కన్య, లోపలికి పరుగెత్తికెళ్ళి గడ్డిచాపతెచ్చి పరిచింది

"నువ్వు చాల మారిపోయావు కన్యా!"

"కాలం బాబుగారూ! మీరుమాత్రం మారిపోలేదూ?" అంది కన్య.

"నువు ప్రతాపరావును పెళ్ళాడటం నాకు చాలా సంతోషంగా వుంది."

"నాకోసం చెయ్యి పోగొట్టుకున్నాడు బాబు అతడికి దిక్కు ఎవరు?

"నీకోసం చెయ్యిపోయిందా! అరే, ఆమాటే చెప్పలేదతడు."

"ఆరేళ్ళక్రితం బాబూ... దిరిసెన చెట్టు క్రింద ఒక పులి కాచుకుంది. ప్రతాపరావు నాతో ఆనందంగా కబుర్లుచెబుతూ వస్తున్నాడు బాబుగారూ! పులి నన్ను కొట్టబోయింది. అతడి చేతిలో బైనాక్యులర్స్ వున్నాయి వాటితో పులిని మొహంమీద కొట్టాడు. పులి అతడి చేతిని కరచి పారిపోయింది. తర్వాత ఆపరేషన్ చేసి చెయ్యి కత్తిరించారు." అంటూ కన్య తలత్రిప్పి జమునను చూచింది.

"చిన్నమ్మాయిగారా బాబూ!" అంది.

"అవును, పార్వతి పోయింది. జమునను మిగిల్చింది."

కన్య కళ్ళు చెమర్చాయి "అమ్మగారి నోట్లోంచేవూడిపడ్డట్టున్నారుఅమ్మాయిగారూ!" అంది.

తరువాత కన్య లోపలికి వెళ్ళి మూడు గ్లాసులతో మజ్జిగ తీసుకువచ్చింది.

"ప్రతాపరావు యింకా రాలేదా? ఇందాకే వచ్చేస్తానన్నాడు" కన్య తల వొంచుకుంది. "నేను బట్టలపని చేయలేకపోతున్నాను బాబుగారూ! అవిటి వాడు. అతనికి పని రావడం లేదు."

"డాడీ! ఇందాక ప్రతాపరావుగారు పని కోసం కాబోలు తిరుగుతున్నారు. అప్పుడే మనం కనిపించి వుంటాం" అంది జమున.

కృష్ణారావు తలూపాడు. "కన్యా అతడిని నా దగ్గరకు పంపించు. పని విషయంలో ఏదో ఒక ఏర్పాటు చేస్తాను."

కన్య తలూపింది. ఆమె వద్ద సెలవు పుచ్చుకుని ముగ్గురూ వెనక్కి తిరిగారు.

కొంత దూరం వెళ్ళాక జమున వెనక్కి తిరిగింది. గుడిసె వద్దకు పరుగెత్తుకు వచ్చింది.

కన్య ఆమెను ప్రశ్నార్థకరంగా చూచింది.

"ప్రతాపరావు గారికి నీకూ వయసులో తేడా ఎక్కువే కదూ!" అడిగింది జమున.

కన్య సిగ్గు పడింది. పల్చటి పసుపు రంగు చెక్కిలిని ఒక్కసారిగా కుంకుమపూసుకుంది.

"పదిహేడేళ్ళవార వుంటుందమ్మ గారూ!" అంది కన్య.

"నువు చాలా అందంగా వుంటావు."

కన్య మొహమాటంగా చూసి "మా యిద్దరిలోనూ ఆయనే అందగాడు. కాల పరిస్థితులు ఆయన అందాన్ని తినేశాయి." అంది.

జమున నిర్ఘాంతపోయింది. ప్రతాపరావు ముసలివాడయిపోయాడు. దుర్బలంగా వున్నాడు. కన్యలో యింకా యవ్వన బింకం వుంది. అయినా ఆమెకు ప్రతాపరావు పూర్వపు యవ్వనమే గుర్తుంది. ప్రస్తుత దుర్బలత్వం మీద ఏవగింపు లేదు.

"నువు సెలయేటిలో స్నానం చేయక!"

"అదేమిటమ్మగారూ!"

"నీ అందం ఒక్క ప్రతాపరావుకే ఆనందం యివ్వాలి. అందుకే" జమున వెనక్కి తిరిగింది. కృష్ణారావు దూరంగా నడుస్తోన్నాడు.

"నువ్వేం మాట్లాడాలో చాటు నుండి విన్నాను "ఆమెకునువు ఆ సలహా యివ్వకుండా వుండవలసింది" అన్నాడు గిరి.

"ఏం?" అంది జమున.

"నీకు అసూయ"

"అవును. ఆమె నాకంటె ఇరవై యేళ్ళు పెద్దది. అయినా ఆమె కున్న శరీర సౌంతం నాకులేదు. ఆమెను సెలయేట్లో చూసినప్పుడు నాలాంటి భార్య మీలాంటి కాముకుల దృష్టికి ఆనదు."

గిరి ఆమెను భుజాలచుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకున్నాడు "జమునా, కామం శరీరానికి సంబంధించినదే. కాదనను అంతకు మించిన అనుభూతి మనసు యిస్తోంది. అందుకే అత్తయ్య భౌతికంగా లేకపోయినా మామయ్య ఆమెతో అనుభూతి పొందుతున్నాడు. ప్రతాపరావు ముసలివాడైపోయినా కన్య అతడిలో యవ్వనపు తాపం చూస్తోంది. నువు శారీరకంగా మానసికంగా నా అనుభూతికి సరిపోయావు. అన్నింటికంటె ముఖ్యం మనసు... అందుకే కన్యవంటి సెలయేటి స్నానరూపం నావంటి వాడు చూసినా అది కేవలం భౌతికం! అనుభూతి పరంగా కాదు" అన్నాడు.

జమున అతడి గుండెలమీద తల వాల్చింది.

*

"నెత్తుటినీ, రగులుతున్న నిప్పులినీ
నల్లగా మార్చాలని కుట్ర"
నవ సమాజాన్ని ఆశిస్తూ వ్రాసిన కవితలు. వాటికి బొమ్మలు
ప్రారంభం (కవితాసంపుటి)
పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణ వెల : 3 రూపాయలు
ప్రతులకు :— బి. విజయరామిరెడ్డి
ప్లాట్ నం. 13, ఎల్.ఐ.సి. కాలని,
యూసఫ్‌గూడా, హైదరాబాద్–500 873.